క్లుప్తంగా

గ్రూప్‌-1లో అవకతవకలు



మహబూబాబాద్‌ అర్బన్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ గ్రూప్‌–1 పరీక్షల్లో స్కాంలు జరిగినట్లు హుజూరాబాద్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరూపించారని, కౌశిక్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నామని బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకురాలు దాసరి అర్షికరావీష్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని 31వార్డులో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. గ్రూప్‌–1లో అవకతవకలు జరిగాయని, కాంగ్రెస్‌ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సమాధానం ఇవ్వాలన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే స్కాంలతో నష్టపోయిన మెరిట్‌ విద్యార్థుల తల్లిదండ్రులతో ఆర్టికల్‌–32 ప్రకారం సుప్రీం కోర్టుకు వెళ్తామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకులు రావీష్‌, గాండ్ల రాము, కన్నం భిక్షపతి, తాడూరి ఓంసాయి, తగరం వివేక్‌, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌ ఇప్పించండి



గూడూరు: మానసిక దివ్యాంగులకు పింఛన్‌ ఇప్పించాలని వీహెచ్‌పీఎస్‌ జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి కోరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం మండలంలోని అయోధ్యపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగులు సౌజన్య, శ్రావణి తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

అంబేడ్కర్‌ వారసత్వ పురస్కారం

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని గుమ్మడూరుకు చెందిన సూర్నపు మహేందర్‌ బాబుకు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వారసత్వ పురస్కారం–2025 దక్కింది. త్రేతాయుగ్‌ ఫౌండేషన్‌ నిర్వాహకులు దేశంలోని దళిత కులంలో పుట్టి దేశంలోని వివిధ రంగంలో అత్యున్నత స్థాయిలో సేవలందిస్తూ, అంబేడ్కర్‌ ఆశయాలను సజీవంగా ఉంచుతున్నవారిని గుర్తించి ప్రతి సంవత్సరం ఈ పురస్కారం అందజేస్తున్నారు.

ఏఎన్‌ఎంలకు మెమోలు జారీ

దంతాలపల్లి: కుమ్మరికుంట్ల ఆరోగ్య ఉపకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏఎన్‌ఎంలకు మెమోలు జారీ చేసినట్లు వైద్యాధికారి చైతన్య మంగళవారం తెలిపారు. దొనకొండ గ్రామంలో నవజాతి శిశువులకు టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్చరీ క్రీడాభివృద్ధికి సహకారం

మహబూబాబాద్‌ రూరల్‌: ఆర్చరీ క్రీడాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌ చందర్‌ రెడ్డి అన్నారు. భారత ఆర్చరీ అసోసియేషన్‌ సభ్యులుగా నియామకమైన పుట్ట శంకరయ్య మంగళవారం డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌ చందర్‌ రెడ్డిని మర్యాదపూర్వంగా కలిశారు. కార్యక్రమంలో గుగులోత్‌ దస్రునాయక్‌, నూకల బాలకృష్ణారెడ్డి, హరికృష్ణరెడ్డి, భువనగిరి గిరిధర్‌ గుప్తా, సింగం మనోహర్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రంలో మాజీ భారత ప్రధాని రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్‌ భూక్య మురళీనాయక్‌కు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ గుగులోతు వెంకట్‌ నాయక్‌, మాజీ వార్డు కౌన్సిలర్‌ సభ్యుడు పోతురాజు రాజు, బోనగిరి గిరిధర్‌ గుప్తా, నిమ్మల శ్రీను, దండెబోయిన బుజ్జివెంకన్న, శంతన్‌ రామరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ బాటలో కాంగ్రెస్‌ ప్రభుత్వం

నెల్లికుదురు: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నడిచిన బాటలోనే కాంగ్రెస్‌ ప్రభుత్వం నడుస్తోందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు గుగులోతు వీరన్న నాయక్‌ ప్రభుత్వంపై మండిపడ్డారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో యన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని కురవి గేటు పరిధిలో పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున పోలీసు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇళ్లను ధ్వంసం చేయడం దారుణం అన్నారు. కార్యక్రమంలో బాబు గౌడ్‌, శ్రీను, యాకూబ్‌, సంతోష్‌, బాలు, రాంజీ పాల్గొన్నారు.

బెట్టింగ్‌ జోరు.. యువత బేజారు

- మొదలైన ఐపీఎల్‌ సీజన్‌
- బెట్టింగులతో ఆర్థికంగా చితికిపోతున్న యువత
- ఆన్‌లైన్‌ వేదికగా యథేచ్ఛగా దందా
- అధికారులు దృష్టి సారించాలని కోరుతున్న తల్లిదండ్రులు



బెట్టింగ్‌ నిర్మూలనపై జిల్లా పోలీసు శాఖ ముద్రించిన పోస్టర్‌

మహబూబాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు హైదరాబాదులో ఉంటూ ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తూ 2021లో క్రికెట్‌ బెట్టింగులపై పెట్టుబడులు పెట్టాడు. ఈ క్రమంలో అతడు రూ.10లక్షల వరకు బెట్టింగ్‌ పెట్టగా ఆర్థికంగా నష్టపోవడంతో తల్లిదండ్రులు ఏమంటారోనని భయపడి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఆ విషయాన్ని ఆ యువకుడి తల్లిదండ్రులు బయటకు చెప్పలేక మనోవేదనకు గురై తమ కుమారుడు అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ బంతికి పక్కా సిక్స్‌.. లేదు వికెట్‌.. లేదు లేదు.. ఈ ఓవర్లో ఐదు ఫోర్లు.. లేదా నాలుగు సిక్సులు పడతాయి.. టాస్‌ గెలిచిన జట్టే బ్యాటింగ్‌ చేస్తోంది. ఫలానా ఆటగాడు మ్యాచ్‌ ను మలుపు తిప్పుతాడు అంటూ.. రూ.10వేల బెట్టు.. ఐపీఎల్‌ సీజన్‌ ఇలా మొదలైందో లేదో బెట్టింగులు ఊపందుకున్నాయి. గ్రామం, పట్టణం ఏదైతేనేమీ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. మార్చి 22న ఐపీఎల్‌ ఆరంభమైనప్పటి నుంచి బెట్టింగ్‌ రాజులకు పండుగే పండుగ.. పందెం రాయుళ్లు అడ్డాలను ఏర్పాటు చేసుకుని, ఆన్‌లైన్‌, సెల్‌ఫోన్లలో వారికి తెలిసిన కోడ్‌ భాషల్లో బెట్టింగుకు పాల్పడుతున్నారు.

రకరకాలుగా బెట్టింగులు..

ఆటల్లో బెట్టింగ్‌ రకరకాలుగా జరుగుతుండగా కొంత మంది గ్రూపులుగా ఏర్పడి బెట్టింగులకు పాల్పడుతున్నారు. మ్యాచ్‌ అయిపోగానే వారివారి బెట్టింగుల్లో ఎవరికి ఎవరు ఎంత ఇవ్వాలో చివరికి లెక్క చూసుకుంటున్నారు. క్రికెట్లో బెట్టింగులు వివిధ రకాలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఒక టీం టాస్‌ గెలిచే విషయంలో బెట్టింగ్‌ పెడతారు. అదే విధంగా ఏయే టీం ఎన్ని పరుగులు చేస్తాయి. ఏ టీం గెలుస్తుంది. ఏ బ్యాట్స్‌ మెన్‌ ఎన్ని పరుగులు చేస్తాడు? అనే విషయాలపై బెట్టింగ్‌ చేస్తున్నారు.

దారి తప్పుతున్న యువత..

క్రికెట్‌ బెట్టింగులకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా యువత ఉన్నట్లు సమాచారం. ఎక్కువగా బెట్టింగులకు పాల్పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలుస్తోంది. కొంత మంది బెట్టింగ్‌ మోజులో తమ బంగారు ఆభరణాలను సైతం తాకట్టు పెడుతున్నట్లు సమాచారం. యువతను పెడదోవపట్టిస్తున్న ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెట్టింగ్‌ చట్టరీత్యా నేరం



ఎవరైనా ఐపీఎల్‌ క్రికెట్‌ మ్యాచుల బెట్టింగ్‌ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్‌ క్రికెట్‌ మ్యాచ్‌ లకు బెట్టింగ్‌ కు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి స్నేహితుల ప్రలోభాలకు లోనవకండి. అసలైన గెలుపు.. కష్టపడి సాధించిందే. బెట్టింగ్‌ చేయడం చట్టరీత్యా నేరం. నిబంధనల ప్రకారం ఇది చట్ట విరుద్ధం కూడా. బెట్టింగ్స్‌ వేసి డబ్బులు నష్టపోయి జీవితాలను నాశనం చేసుకోకండి.

– సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌, ఎస్పీ

ఎస్సీ వర్గీకరణ చట్టంపై హర్షం



కేసముద్రం: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని, భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబటి లక్ష్మి, అంబేడ్కర్‌ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మందుల కృష్ణమూర్తి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వేల్పుగొండ ఏలియా, క్లెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్‌: ఎస్సీ వర్గీకరణను సీఎం చేయడం అభినందనీయమని కాంగ్రెస్‌ గ్రామ అధ్యక్షుడు నలమాస మహేష్‌ అన్నారు. మంగళవారం మండలంలోని మాటేడు గ్రామంలో సీఎం రేవంత్‌ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాల్వకోలన్‌ సురేందర్‌ రాజు, మహంకాళి దేవేందర్‌ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఘనత కాంగ్రెస్‌దే..

గూడూరు: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, ధరణి స్థానంలో కొత్తగా రూపొందించిన భూభారతి రూపొందించిన ఘనత కాంగ్రెస్‌ ప్రభుత్వానికే దక్కిందని మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్‌ అంబేడ్కర్‌ సెంటర్‌లో మంగళవారం శ్రీ జాంబవ దళిత వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌ రెడ్డి, ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ నూనావత్‌ రమేశ్‌నాయక్‌, బోడ వెంకన్న, నవీన్‌, పార్నంది రామయ్య, బోడ ఎల్లయ్య, రాసమల్ల వెంకన్న పాల్గొన్నారు.

ముఖ్తార్‌పాషా స్మారకస్తూపం ఆవిష్కరణ



స్మారకస్తూపాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, తదితరులు

బయ్యారం: పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతూ అమరుడైన ముఖ్తార్‌పాషాకు దోపిడీ లేని సమసమాజ స్థాపన నిర్మించడం ద్వారానే నిజమైన నివాళి అని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తపేటలో నిర్మించిన పాషా స్మారకస్తూపంను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆ తరువాత బయ్యారంలో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలలో పార్టీ రాష్ట్ర నాయకులు మధు, గోవర్ధన్‌, సంధ్య, వెంకన్న, అనురాధ, సీతారామయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చొద్దని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్‌: పేదల ఇళ్లు కూల్చొద్దని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ కార్యాలయంలో కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌ సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇల్లు లేని పేదలు కలెక్టర్‌ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారన్నారు. ఆ భూమిని రియల్టర్లు ఆక్రమించుకుని రియల్‌ ఎస్టేట్‌ చేసే ప్రయత్నం చేయగా పార్టీ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. ఆ గుడిసెలను పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు 21సార్లు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతలను నిలుపుదల చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌ నిర్మాణం చేపట్టాలి

గార్ల: గార్ల మండలం ముల్కనూరు సమీపంలోని పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్ట్‌ నిర్మించి, గార్ల మండలంలో తాగునీరుతోపాటు సాగునీరు అందించేందుకు చెరువులను నింపాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో దివ్య ఐఏఎస్‌కు గిరిజన రైతు గంగావత్‌ సుఖ్యానాయక్‌ వినతిపత్రం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

దంతాలపల్లి: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వ విప్‌ రాంచంద్రునాయక్‌ అన్నారు. మండలంలోని రామానుజాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద చలివేంద్రాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్టునాయక్‌, శ్రీను, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కురవి: సీరోలు మండలం చింతపల్లి శివారు పెద్దలాల్‌ తండా గ్రామంలో భూక్య సంక్రియానాయక్‌ ఆధ్వర్యంలో బద్ది పోచమ్మ తల్లికి తండావాసులు మంగళవారం బోనాలను సమర్పించారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



తొర్రూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

తొర్రూరు: ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమం వామపక్షాలు, జార్జిరెడ్డి అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌ కేంద్రంలో నిర్వహించారు. విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్‌ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జార్జిరెడ్డి మార్పుకోసం పని చేశాడని, చిన్న వయసులోనే ఉస్మానియా వేదికగా విద్యార్థి ఉద్యమాలను నిర్మించాడని గుర్తు చేశారు. వామపక్ష పార్టీల నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, ఎండీ యాకూబ్‌, ఊడుగుల లింగయ్య, బందు నారాయణ, కొండం జనార్దన్‌, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌ బిల్లు లౌకిక స్ఫూర్తికి విరుద్ధం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగించే బిల్లులను సీపీఐ ఖండిస్తుందని తెలిపారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్‌, సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, రైతు సంఘం నాయకుడు బుడమ వెంకన్న, మైనార్టీ సంఘం నాయకులు మజీద్‌ సదర్‌, ఎస్‌కె రషీద్‌, మజీద్‌ ముస్సుబ్‌ యూనూస్‌, జానీ, మౌలానా, సలీం రఫీ, దిస్‌ ఉసామా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

డోర్నకల్‌: డోర్నకల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 2002 బ్యాచ్‌ పదో తరగతికి చెందిన దుర్గాప్రసాద్‌ కొంతకాలం క్రితం మృతి చెందగా అదే బ్యాచ్‌కు చెందిన మిత్రులు బొబ్బాల ఉపేందర్‌, ఎస్‌కె మదార్‌, హైమద్‌, దాసరి శ్రీను, గారె సాగర్‌ తదితరులు దుర్గాప్రసాద్‌ కుటుంబ సభ్యులకు రూ.15వేల నగదు ఆర్థికసాయాన్ని అందించి ఔదార్యం చాటుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

తొర్రూరు రూరల్‌: వేసవిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్‌ శృతి సూచించారు. మండలంలోని అమ్మాపురం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనుల కూలీలకు ఓఆర్‌ఎస్‌, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి, మందులను అందించారు. కార్యక్రమంలో టీఏ సుధాకర్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ యాకయ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామ అధ్యక్షుడిగా ఉపేంద్రాచారి

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు అనంతారం కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బండోజు ఉపేంద్రాచారిని నియమించామని జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌ చందర్‌ రెడ్డి తెలిపారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఉపేంద్రాచారికి నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఉపేంద్రాచారి కృతజ్ఞతలు తెలపారు.

వసతి గృహంలో సామగ్రి పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలోని సామగ్రిని మరో వసతి గృహానికి చేర్చడంపై డీఎస్‌ఈడీఓ కార్యాలయంలో నివేదిక ఇస్తామని ఏఎస్‌డబ్ల్యూఓ శివభాస్కర్‌ రావు అన్నారు. ఇటీవల వసతిగృహంలో సామగ్రి తరలింపుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సామగ్రిని పరిశీలించారు. వసతి గృహంలో సామగ్రి మొత్తం ఉన్నట్లు శివభాస్కర్‌రావు తెలిపారు.

నకిలీ తీర్మానంపై విచారణ

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక శాఖ సంఘంలో తమ సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ తీర్మానం చేశారంటూ ఆరోపిస్తూ సంఘం సభ్యులు జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుపై, మంగళవారం గ్రామంలో విచారణ జరిపినట్లు మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రారంభోత్సవానికి పిలవకుండా అవమానించారు

దంతాలపల్లి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ప్రాథమిక వ్యవసాయ సంఘం డైరెక్టర్‌కు అవమానం జరిగిందని దళిత సంఘాలు మంగళవారం తెలిపారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్‌ దర్శనాల శైలజ మాట్లాడుతూ.. మండలకేంద్రంలోపాటు మండలంలోని కుమ్మరికుంట్ల, రామానుజాపురం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి దళిత డైరెక్టర్‌ అయిన తనను పిలువకుండా అవమానించారని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెల్లికుదురు సెంటర్‌: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌ యువ వికాసం పథకాలను అర్హులందరికీ అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలయాపన చేయకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు, నిరుద్యోగులకు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్మిక దినోత్సవ మే డేను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్‌, రేషపల్లి నవీన్‌, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, వెలుగు శ్రావణ్‌, అశోక్‌, జ్ఞానేశ్వర్‌ పాల్గొన్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటు సారా, వాహనాలను చూపుతున్న ఎక్సైజ్‌ సిబ్బంది

తొర్రూరు: గుడుంబా తయారీ, రవాణా సమాచారం అందుకున్న ఎక్సైజ్‌ సిబ్బంది మంగళవారం డివిజన్‌ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఏఈఎస్‌, తొర్రూరు ఇన్‌చార్జ్‌ రాజేశుని ప్రవీణ్‌ తెలిపిన వివరాల మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్‌ సిబ్బంది తొర్రూరు డివిజన్‌ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 40లీటర్ల నాటుసారా, 100కిలోల పటిక, 450కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక కారును సీజ్‌ చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా సంబంధిత నిందితులపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టు నమోదు చేస్తామని ఏఈఎస్‌ ప్రవీణ్‌ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌, ఎక్సైజ్‌ అధికారులు నాగేశ్వర్‌రావు, బాలరాజు, ఎస్సై రవళిరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ఆస్పత్రి నిర్మించలేదు



దీక్షకు మద్దతు తెలుపుతున్న దయాకర్‌రావు

తొర్రూరు: తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈమేరకు వామపక్ష పార్టీలతో కూడిన జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. దీక్షకు మద్దతు తెలిపిన దయాకర్‌రావు మాట్లాడుతూ.. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించానని, నిధులు మంజూరైనా రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రి నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌ సారథి, పోరాట కమిటీ కన్వీనర్‌ తమ్మెర విశ్వేశ్వరరావు, కోకన్వీనర్‌ కొత్తపల్లి రవి, నాయకులు బందు నారాయణ, ఓమ భిక్షపతి, ముంజంపల్లి వీరన్న, అలకుంట్ల సాయిలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

కేసముద్రం: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్‌ చేశాడు. మంగళవారం మండలంలోని గాంధీనగర్‌జీపీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని నాయకులు సందర్శించి, కూలీల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్యానాయక్‌, సారయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

చిన్నగూడూరు: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జయ్యారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన మీసాల ఉప్పలయ్య(55) గ్రామంలోని గేదెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా మంగళవారం గేదెలను తోలుకొని చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామ శివారు పెద్ద చెరువులోకి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మునిగి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార్ల: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అంజనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పెద్దకిష్టాపురం పంచాయతీ అంజనాపురం గ్రామానికి చెందిన కర్లకంటి మధు(37) ఖమ్మం జిల్లా వైరా నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చి నివసిస్తున్నాడు. మధుకు భార్య ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలం పాటు కూలి పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించేవాడు. రెండేళ్ల నుంచి మద్యానికి బానిసై కూలి పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి బానిసైన మధు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన మహబూబాబాద్‌ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌ పాషా వెల్లడించారు.

ప్రజాపాలనతో పేదలకు మేలు

డోర్నకల్‌: కాంగ్రెస్‌ ప్రజాపాలనతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్‌ పేర్కొన్నారు. మండలంలోని లింబ్యాతండా, హూన్యాతండా, రాముతండాలో మంగళవారం నిర్వహించిన జైబాపూ, జైభీమ్‌, జైసంవిధాన్‌ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగదీష్‌, చిలకబత్తిని మాణిక్యరాజ్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు శేఖర్‌, భూక్యా శ్రీనివాస్‌, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డోర్నకల్‌: స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ప్రగతి మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఐకేపీ ఏపీఎం శంకర్‌నాయక్‌ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా తేలూరి కరుణ, ప్రధాన కార్యదర్శిగా లింగనబోయిన నాగజ్యోతి, కోశాధికారిగా వేములపల్లి ప్రమీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.